## మౌలిక వసతులు కల్పిస్తాం



టెలికంకాలనీలో వసతులు కల్పించాలని కార్పొరేటర్ సబితా కిశోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**మల్కాజిగిరి, జూన్1:** ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా కిశోర్ అన్నారు. టెలికం కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం కార్పొరేటర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులతో కాలనీలో సర్వే నిర్వహించి సీసీ రోడ్లు డ్రైనేజీ వేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కిశోర్, రమణ రెడ్డి, దేవి, సంజయ్ కిరణ్, ప్రమోద్ కుమార్, బ్రహ్మ చారరి, డీఎన్ రావు, శోభ, తిలక్, చంద్రిక, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కీసరగుట్ట కమాన్ వద్ద చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**కీసర, జూన్1:** కీసరగుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. కీసరగుట్ట కమాన్ వద్ద పోలీసులు 24 గంటల పాటు అక్కడనే ఉండి యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం నుంచి కీసర మీదుగా హైదరాబాద్ నగరానికి వచ్చే వాహనాలను, కీసర నుంచి యాదాద్రి ప్రాంతాలకు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాచకొండ పరిధిలోని కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ తదితర ప్రాంతాలకు చెందిన పోలీసులు షిఫ్ట్‌లో చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ

**కీసర, జూన్1:** మండలంలోని తిమ్మాయిపల్లి, చీర్యాల్, కీసర, అంకిరెడ్డిపల్లి ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఆదివారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన నేతలు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో పట్టాలను లబ్ధిదారులకు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి గంగన్న

# రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పోచారం మున్సిపాలిటీ వరంగల్ రోడ్డుపై జోడిమెట్ల వద్ద ఏర్పాటు చేసిన భారీ కటౌట్.



ఆవిర్భావ దినోత్సవానికి ముస్తాబైన కలెక్టరేట్

**మేడ్చల్‌కలెక్టరేట్ , జూన్ 1:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 9.00 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. ఉదయం 8.10 గంటలకు కీసర చౌరస్తా వద్ద తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఇందుకు గాను కలెక్టరేటులో అవసరమైన ఏర్పాట్లు జరుగుచున్నవి. సభావేదిక, బారికేడ్లు, వీఐపీలు, అధికారులు, కూర్చునేనందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

**మేడ్చల్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఉదయం 8:30 గంటలకు జరిగే జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విచ్చేస్తున్నారని బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. అలాగే మేడ్చల్ పట్టణంలో కేఎల్ఆర్ వెంచర్ జయశంకర్ చౌరస్తాలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**పోచారం:** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పోచారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు.పోచారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అన్ని వార్డులలో తెలంగాణ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ నా యకులు,కార్యకర్తలు హాజరు కావాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పోచారం బీఆర్ఎస్ నాయకుడు సామల సందీప్ రెడ్డి పోచారం మున్సిపాలిటీ వరంగల్ రోడ్డు నారపల్లి,జోడిమెట్ల వద్ద భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.

## కట్టమైసమ్మ జాతరకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం



**శామీర్‌పేట, జూన్ 1 :** అలియాబాద్ గ్రామ కట్టమైసమ్మతల్లి జాతర సందర్భంగా అలియాబాద్ గ్రామస్తులు, పెద్దలు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆదివారం మర్యాపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కుమార్‌యాదవ్, గూడె ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్, సొసైటీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు గోపి, రాజు, మధుసూదన్‌రెడ్డి, నర్సింహా, ఇమ్మాన్, దేవేందర్, మన్మదచారి, పాల్గొన్నారు.







## రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా:ఎమ్మెల్యే



నేతాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్ ,జూన్ 1:** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా నని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మ్యాట్రిక్స్ దవాఖాన ఆధ్వర్యంలోఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న, నాయకులు నాగేశ్వర్ రావు ,బాబు యాదవ్ , పవన్ కుమార్ చాంద్ పాషా, నరేష్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అప్పటి స్నేహితులు

**శామీర్‌పేట, జూన్ 1:** చదువుకోవడం, ఆడుకోవడం చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకోవడమే కాదు ఆపదలో అండగా నిలవడమే నిజమైన స్నేహం అని ఆ విద్యార్థులు నిరూపించారు. శామీర్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాల 1999-2000వ విద్యా సంవత్సరంలో 10వ తరగతికి చెందిన మహిపాల్‌రెడ్డి అకాల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న తన చిన్ననాటి స్నేహితులు, క్లాస్ మెట్స్ మహిపాల్‌రెడ్డి కుటుంబానికి రూ.70వేల ఆర్థిక సాయం అందజేసి తోడ్పాటునందించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వచ్చిన తాము ఉన్నామనే భరోసా కల్పించారు.

## ప్రజా పాలనలో.. ఇన్‌చార్జిలే దిక్కు

**ఉప్పల్, జూన్1:** కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పన్న ప్రజా పాలన ప్రజలకు అందడం లేదు. ప్రజల అవసరాల కోసం అందుబాటులో ఉండాల్సిన అధికారులు పూర్తిస్థాయిలో ఉండడం లేదు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో పూర్తిస్థాయి అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### కీలక పదవులన్నీ ఇన్‌చార్జిలే..

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగం డీఈ చందన ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా ఉప్పల్ సర్కిల్లో ప్రాజెక్టు ఆఫీసర్ ఇన్‌చార్జితోనే కొనసాగిస్తున్నారు. వీటితో పాటుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీగా ఇన్‌చార్జి ఉండగా, టీపీఎస్‌కు మరొక సర్కిల్ కేటాయించారు. దీంతో పలు కీలక విభాగాల్లో ఇన్‌చార్జులు ఉండడంతో ప్రజలకు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది. వీరికి ఈ సర్కిల్‌తో పాటు మరో ప్రాంతంలో కూడా పోస్టింగ్ ఉండడంతో రెండు ప్రాంతాల్లో పనిచేయాల్సి వస్తుంది. ప్రజాపాలనలో ప్రజలకు పాలన అందించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



శిల్పారామంలో చిన్నారుల కూచిపూడి నృత్య భంగిమ

**రామంతాపూర్ ,జూన్ 1:** ఉప్పల్ మినీ శిల్పారామం ఆదివారం శ్రీ దత్త సంగీత నృత్య కళాశాల గురువు దుర్గ భవాని శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మహాగణపతిమ్, బ్రహ్మాంజలి, అదిగో అల్లదిగో, తిల్లాన, చేరి యశోదకు, కృష్ణ శబ్దం, హిందోళ తిల్లాన, చక్కని తల్లికి, గరుడగమనా, కృష్ణ కృష్ణ, కొలువైఉన్నడే, ఒకపరి కొకపరి, వచ్చెను అలమేలుమంగా, తరంగం,మొదలైన అంశాలను తపస్వి, కావ్య, సాన్విక, సిరి, చందన, లక్ష్మి సహస్ర , ఆరాధ్య సాయి కీర్తన, లక్ష్మి మేఘన, వల్లి తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

## వర్షాకాలంలో ఇబ్బందుల కలుగకుండా చర్యలు

**రామంతాపూర్, జూన్ 1:** వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడతామని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అనారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలువ కుండా కొత్త వాటర్ డ్రైన్‌లకు, సీసీ రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి. డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వాటర్ వర్క్స్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది ఉపేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు కొండల్ రెడ్డి జగన్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బాలకృష్ణగౌడ్ ,బాలు, బంటి గౌడ్ ,శ్యామ్ ,అశోక్ చారి, కాలనీ అసోసియేషన్ సభ్యులు,కాలనీ మహిళలు పాల్గొన్నారు.



చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గీతా ప్రవీణ్.

## కార్మికుల హక్కుల కోసం పోరాడేది 'కామ్రేడ్‌లే'



జవహర్‌నగర్‌లో ఆటోయూనియన్ సభ్యత్వ నమోదును ప్రారంభించిన సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**జవహర్‌నగర్,జూన్1:** కార్మికుల హక్కుల కోసం పోరాడేది కామ్రేడ్‌లేనని, బూర్జివ పార్టీలు నాయకత్వం కోసం కార్మికులను తమవైపు తిప్పుకుని అధికారంలోకి రాగానే పట్టించుకోకపోవడం ఆనవాయితీగా మారిందని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ దుయ్యబట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సాయిబాబా కమాన్ ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ హాజరై మాట్లాడుతూ కార్పొరేట్ కబంధ హస్తాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, లేబర్ కోడ్‌లను ఎత్తివేస్తూ కార్మికుల నోట్లో విషం పోసినట్టు ప్రభుత్వాలు చేస్తున్నాయని, సీపీఐ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతుందని అన్నారు. అనంతరం సీపీఐ జెండాను ఎగురవేసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆటో, హమాలీ కార్మికులు ఏఐటీయూసీలో చేరి సంఘం బలోపేతానికి సహకరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు.


కార్యక్రమంలో నిమ్మల నర్సింహా, కృష్ణమూర్తి, దర్శనం యాదగిరి, స్వరూప, సహదేవ్, బాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు మృతి



శ్రీనివాస్ మృతదేహంవద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

**మల్కాజిగిరి, జూన్ 1:** సీనియర్ జర్నలిస్టు, ప్రాత్రికేయం దినపత్రిక ఎడిటర్ పెంటూకర్ శ్రీనివాస్(54) అనారోగ్యంతో నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పాతికేళ్లుగా ఆయన వివిధ పత్రికల్లో పనిచేశారు. ఆయనకు భార్యతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు మల్కాజిగిరి పరిధి గౌతంనగర్‌లోని ఆయన నివాసంలో శ్రీనివాస్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు.



చర్లపల్లి డివిజన్, పెద్ద చర్లపల్లికి చెందిన మమత సివిల్‌కోర్టు జడ్జిగా నియమితులు కావడంతో ఆమెను నాయకులు లక్ష్మణ్‌గౌడ్, నాథం, నర్సింగ్‌రావు, గణేశ్ ముదిరాజ్, రమేశ్‌యాదవ్, రత్నపురం వెంకటేశ్, ప్రతాప్‌రెడ్డి సన్మానించారు. -చర్లపల్లి, జూన్1

## కార్మికుల సంక్షేమమే ధ్యేయం

జీడిమెట్ల : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని సాయినార్ లేబరేటరీ కంపెనీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో సాయినార్ లేబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆరో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆదివారం కంపెనీ కార్మికులు యూనియన్ అధ్యక్షుడు నాగరాజును చింతల్, వాణినగర్‌లోని నాగరాజు నివాసంలో కలిసి గజమాలతో సన్మానించారు.

# బసవేశ్వరుడు..గొప్ప తత్వవేత్త



మహాత్మా బసవేశ్వరుడు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, జూన్ 1 : ' బహుజన హితాయ .. బహుజన సుఖాయ ' సిద్ధాంతంతో సామాన్యుల హక్కుల కోసం శ్రమించిన గొప్ప తత్వవేత్త మహాత్మా బసవేశ్వరుడని బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్, జీడిమెట్ల ఫాక్స్ సాగర్ కట్టకింద ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ మహాత్మా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేశ్ రెడ్డి, ఫిషరీస్ కో-ఆపరేటివ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మన్నె రాజు, ఫాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు, దుర్గారావు, గుబ్బల లక్ష్మీనారాయణ, అడప శేషు, బలరాం రెడ్డి, శ్రీనివాస్ రాజు, ఇస్మాయిల్, దుబాయ్ శ్రీను, సంఘం గౌరవాధ్యక్షులు శెట్టి ప్రకాశ్, కోలుకుండ బస్వరాజ్, ఎస్. వీరశెట్టి, అధ్యక్షులు నాగరాజు గౌడ, కోశాధికారి అమరనాథ్, కార్యదర్శి రుద్రకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. బసవ రాజు, సభ్యులు శరణ్, అవుటి రమేశ్, సోమశేఖర్ గౌడ్, ప్రభులింగం, బస్వరాజు, శంకర్, ఎం.మల్లేశం, కుల బాంధవులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా..



6వ ఫేజ్‌లో సీనియర్ సిటిజన్స్‌తో కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1: సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటానని, వారికి సేవ చేయడం మహాభాగ్యమని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్ భవనంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు సొంత నిధులతో మరమ్మతులు చేసి మౌలిక వసతులు కల్పించారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరామ్, ప్రసాద్ ఫణి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## వేసవిలో శిక్షణ ఇవ్వడం అభినందనీయం

**బాలానగర్ :** భగత్‌సింగ్ పార్కులో 45 రోజులు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ముగింపు కార్యక్రమానికి కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ హాజరయ్యారు. శిక్షణ పొందిన యువతకు కార్పొరేటర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు వేసవి సెలవులను వృథా చేయకుండా కరాటే శిక్షణ శిబిరంలో పాల్గొని కరాటే అభ్యసించడం మంచి పరిణామన్నారు. కోచ్ దుర్గారావు, శిక్షణ పూర్తి చేసుకున్న యువతను కార్పొరేటర్ అభినందించారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**పీర్జాదిగూడ:** ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది స్థానికుల వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం క్యాథూర్ గ్రామా నికి చెందిన శివాజీ రాజ్ వెంకటరెడ్డి జీవనోపాధి కోసం పీర్జాదిగూడలోని ఆదర్శనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. ఆయన పెద్ద కుమార్తె హిమ వైష్ణవి(16) బోడుప్పల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. మొదటి సంవత్సరంలో రెండు సబ్జెక్టు లు ఫెయిల్ అయితే సప్లమెంటరీ పరీక్షలు రాసింది. దీంట్లో కూడా ఫెయిల్ అయితానేమోనని భయంతో తీవ్రమనస్తాపానికి గురైన వైష్ణవి శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మద్యం తాగి యువకుల వీరంగం

**మేడ్చల్, జూన్ 1:** మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో పలువురు యువకులు మద్యం తాగి వీరంగం సృష్టించారు. కాలనీ ఇండ్ల మధ్యలో సాయంత్రం నుంచి రాత్రి వరకు మద్యం తాగుతూ గట్టిగా అరుస్తూ న్యూసెన్సు చేశారు. ఈ విషయాన్ని స్థానికంగా నివాసం ఉండే సందీప్ రెడ్డి ఇదేమిటని ప్రశ్నిస్తే అతడిపై దాడి చేశారు. దీంతో సందీప్ రెడ్డి 100కి ఫోన్ చేశారు. పోలీసులు వచ్చి, ఘటనపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ తరచుగా యువకులు ఈ ప్రాంతంలో మద్యం తాగుతూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇంట్లోమహిళలు ఒంటరిగా ఉంటే మద్యం తాగే యువకులు చేసే అల్లరికి భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. ఇంట్లో మధ్యలో బహిరంగంగా మద్యం తాగే వారిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వ్యక్తిపై దాడి, కేసు నమోదు

**కీసర, జూన్ 1:** ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసరలోని ఎస్సీ బస్తీలో నివాసం ఉండే కర్రెగణేశ్ తన కారును గడి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం పార్కు చేశాడు. పార్కు చేసిన కారుపై మట్టి పోసి గీతలు గీసి అసభ్య పదజాలంతో కారుపై రాతలు రాశారు. ఈ విషయాన్ని గమనించిన గణేశ్ తన కారుపై ఎవరు గీతలు గీశారని నిలదీశాడు. అదే కాలనీకి చెందిన కె. సత్యనారాయణ అతని కుమారుడు తరుణ్‌లు ఎవరిని తిడుతున్నావని అతనిపై ఇటుకతో దాడి చేశారు. ఆ దాడిలో గణేశ్ తలకు బలమైన గాయమ రక్తపు మరకలతో కీసర పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాస్ ఈ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.